అద్దె భవనాల్లో ఇంకెన్నాళ్లు?



బస్వాపురంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రం

- మండలంలో 32 అంగన్‌వాడీ కేంద్రాలు
- వసతులు లేక చిన్నారుల సంఖ్య తగ్గుముఖం

ఉండవెల్లి: మండలంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన వసతులు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 32 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. కొన్నింటికి మాత్రమే సొంత భవనాలు ఉండడంతో మిగితా వాటిని పాఠశాల భవనాల్లోనే కొనసాగిస్తున్నారు. ఒకే పాఠశాల గదిలో రెండు కేంద్రాలు ఉండడంతో చిన్నారులకు ఏ టీచరో తెలియక, ఎవరి భోజనం ఎక్కడ తినాలో తెలియక సతమతమవుతున్నారు.

32 కేంద్రాల్లో 13 అద్దె భవనాల్లోనే..

32 కేంద్రాల్లో 13 అద్దె భవనాల్లో, 9 కేంద్రాలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా.. మిగిలిన 10 కేంద్రాలు, కమ్యూనిటీ, పాఠశాల భవనాల్లో నెట్టుకొస్తున్నారు. దీనిపై పలుమార్లు ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా.. పట్టించుకోవడం లేదని టీచర్లు వాపోతున్నారు. చిన్నారులకు అందించే బాలామృతం, ఇతర పోషకాహారం నిల్వ చేసేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.



మెన్నిపాడులో ఒకే గదిలో రెండు కేంద్రాలు

సొంత భవనాల్లోనే మోడల్ అంగన్‌వాడీకేంద్రాలు

మండల కేంద్రంలో రెండు కేంద్రాలు సొంత భవనంలో ఉండగా.. రెండు పాఠశాలలో, మిగితా రెండు అద్దె భవనంలో ఉన్నాయి. కలుగోట్ల, మెన్నిపాడు, తక్కశిల, ప్రాగటూరు, తదితర గ్రామాల్లో ఒకే పాఠశాల తరగతి గదిలో రెండు కేంద్రాలను కొనసాగిస్తున్నారు. దీంతో చిన్నారులకు కనీస విద్యా బోధనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వంట చేయడానికి సైతం అవస్థలు తప్పడం లేదు. ఈ కారణాల చేత అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడడంతో పాటు ప్రైవేటు పాఠశాలలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాలను నిర్మించాలని కోరుతున్నారు.

అద్దెకు భవనాలు దొరకని పరిస్థితి

గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు అద్దెకు ఇవ్వడం లేదు. చిన్నారుల సంఖ్య తగ్గుముఖం పడడంతో పాఠశాలలోనే ఏర్పాటు చేయాలని అధికారులు చెబుతున్నారు. దీంతో రెండు కేంద్రాలను ఒకే గదిలో కొనసాగిస్తున్నాం. చిన్నారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– మాధవి, అంగన్‌వాడీ టీచర్, మిన్నిపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సంఖ్య పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో రెండు కేంద్రాలను ఒకే గదిలోనే ఏర్పాటు చేసిన మాట నిజమే. తొందర్లోనే ఈ ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలు మరోసారి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– సుజాత, సీడీపీఓ, మానవపాడు

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



కేటీదొడ్డి: మండలంలోని కొండాపురంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయంలోని బీఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణ ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు పక్కదారి పట్టకుండా అభివృద్ధి పనులు నాణ్యతగా చేయాలన్నారు. గ్రామంలో రోడ్డుపై మురుగు పారకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోనేలా అవగాహన కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాత భవనాలు తొలగించాలని, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు వేయాలని వినతిలో పేర్కొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

అయిజ: కేంద్ర హోం మంత్రి అమిత్ షా పుట్టినరోజును పురస్కరించుకొని మంగళవారం బీజేపీ నాయకులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన చికిత్స అందించాలని, పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు ఇబ్బంది కలిగకుండా అన్ని వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కంపాటి భగత్ రెడ్డి, వీరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



అలంపూర్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పరీక్షా క్షేంద్రాలను డీసీఈబీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ జహీరుద్దీన్ ఎంఈఓ అశోక్‌కుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. జెడ్పీహెచ్ఎస్ హరిజనవాడ, జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను వారు సందర్శించి ఎస్ఏ-1 పరీక్షలను పరిశీలించారు. పరీక్షా పత్రాలు ఎలా వచ్చాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల నుంచి సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు.

కేటీదొడ్డి ఏఓగా సాజిద్ రెహ్మాన్



కేటీదొడ్డి: మండల నూతన వ్యవసాయాధికారిగా సాజిద్‌రెహ్మాన్ నియమిస్తూ జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మహాలక్ష్మి గద్వాల మండలం ఏఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంగళవారం కేటీదొడ్డి మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో నూతన ఏఓగా సాజిద్‌రెహ్మాన్ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఏఓకు, బదిలీపై వెళ్లిన ఏఓకు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రీతిసుధ, ప్రియాంక, జ్యోతి, లావణ్య, తదితరులు ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని అనంత కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 25, 26వ తేదీల్లో సీపీఎం జిల్లా మూడో మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, రాష్ట్ర సభ్యులు ఎంవీ రమణ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభలకు జిల్లాలోని సీపీఎం శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉప్పేరు నర్సింహ, సవారి, ఈశ్వర్ ఉన్నారు.

ఆలయ డైరెక్టర్‌కు సన్మానం

ఎర్రవల్లి: జోగుళాంబ ఆలయ డైరెక్టర్‌గా ఇటీవల ఎన్నికైన ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన జోగుల సరస్వతిని పలువురు నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు కార్తీకేయరెడ్డి ఎర్రవల్లిలోని ఆమె నివాసంలో కలిసి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్టీ జాబితా పునరుద్ధరణపై చర్చించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వీబీఎస్ఎఫ్ నాయకులు

అలంపూర్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాలని వీబీఎస్ఎఫ్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే విజయుడును వీబీఎస్ఎఫ్ నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వీబీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవిబాబు సూచన మేరకు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితా పునరుద్ధరణ జీఓ నెంబర్ 6/2016 గురించి చర్చించాలని వినతిలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి అనువుగా అసెంబ్లీ బిల్లు పాస్ చేయించి కేంద్రానికి పంపడానికి కృషి చేయాలని వినతిలో విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్, వీబీఎస్ఎఫ్ నాయకులు రాముడు, మల్లేష్ నాయుడు, వీరేష్ నాయుడు, జగదీష్ నాయుడు, వెంకన్న నాయుడు, కార్తీక్ నాయుడు, కృష్ణ నాయుడు, మధు నాయుడు, జానకీరాముడు, మధు, సాయి తదితరులు ఉన్నారు.

దినచర్యలు రిజిస్టర్‌లో నమోదు చేయాలి



ఆశాలకు రికార్డులు అందిస్తున్న వైద్య సిబ్బంది

మానవపాడు: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం సూపర్‌వైజర్ చంద్రన్న ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు దినచర్య రికార్డులను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు ఆశాలు రోజు వారి కార్యక్రమాలను విధి నిర్వహణలో భాగంగా రికార్డుల్లో నిక్షిప్తం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, సోని, వైద్యసిబ్బంది, ఆశలు తదితరులు పాల్గొన్నారు.


రికార్డుల పంపిణీ

రాజోళి: ఆశా కార్యకర్తలు వారి దినచర్యలో చేసే విధుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ఆశా కార్యకర్తలకు మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రిజిస్టర్లు అందచేశారు. ఆయాలకు 17 రకాల రిజిస్టర్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో 35 మంది ఆశా కార్యకర్తలు, టీబీ నోడల్ ఆఫీసర్ జయప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్ హెలెన్, వెంకటేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘రైతు భరోసా’ నిధులు విడుదల చేయండి

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని గాంధీచౌక్‌లోని మహాత్ముడి విగ్రహం వద్ద రైతు భరోసా నిధులు విడదల చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా పంట సాగు చేసే రైతులు ఆర్థిక నష్టాలను చవి చూస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా అన్నదాతలకు పెట్టుబడుల సమయంలో ఊరట నిచ్చేదన్నారు. కానీ యాసంగి సీజన్ ఆరంభం అవుతున్నప్పటికీ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవడంతో పెట్టుబడికి రైతులు ఆందోళన పడాల్సిన పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. రైతు భరోసా నిధులు విడుదల చేసి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, వెంకటస్వామి, రైతులు మద్దిలేటి, శ్రీనివాసులు, సత్యరాజు, మహ్మద్, సత్తార్ ఉన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

గట్టు: రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని జీవనోపాధుల అధికారి వెంకటేశ్వర్లు తెలియజేశారు. మంగళవారం తుమ్మలచెరువులో భవిష్య భారత్ స్వచ్ఛంద సేవా సంస్థ, ఎల్‌టీఐమైంట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అవసరానికి మించి రసాయనిక ఎరువులను వాడడం ద్వారా లాభం కన్నా నష్టమే ఎక్కువ అని తెలిపారు. పంట దిగుబడిలో రైతు మిత్ర పురుగులు చనిపోవడం ద్వారా దిగుబడి తగ్గిపోతుందన్నారు. సేంద్రియ పద్ధతిలో పంటలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడితో పాటుగా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. సేంద్రియ పద్ధతిలో వేరుశనగ, వరి, మిరప పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. 75 శాతం రాయితీపై 30 మంది రైతులకు వేప నూనె పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ కమ్యూనిటీ ఆర్గనైజర్ హాలీంపాషా, రైతులు భాస్కర్, గోవిందు, నర్సింహులు, సవారెడ్డి, నారాయణ, భీమన్న, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల మంజూరుకు సహకరించండి

గద్వాల అర్బన్: శాంతినగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు అయ్యేలా కృషి చేయాలని కోరుతూ బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు కుర్వ పల్లయ్య మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హృదయరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. వడ్డేపల్లి మండలంలో పదో తరగతి పాసైన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్మీడియట్‌ను చదవడానికి ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే జూనియర్ మంజూరు అయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాధవ్, గోపాల్ తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

గద్వాల అర్బన్: మల్దకల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికతో ఇంట్లో వెట్టిచాకిరీ చేయించుకొని దొంగతనం కేసు మోపి బాలిక ఆత్మహత్యాయత్నానికి కారణమైన సీడ్ ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం కార్మిక శాఖ సహాయ జిల్లా నోడల్ అధికారి అబ్రహం కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో రంగస్వామి, వెంకట్రాములు, శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్‌రాజ్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

కేటీదొడ్డి: ఇంటి ఎదుట ఉన్న బాట విషయంలో దాడి చేసిన ఘటన మండలంలోని చింతలకుంటలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జములమ్మ స్థలం నుంచి బాట కావాలని మంగళవారం నాగప్ప, నర్సింహులు ఇద్దరు జములమ్మను అసభ్య పదజాలంతో దూషిస్తూ చేతులతో దాడి చేశారు. వారిని విడిపించడానికి వెళ్లిన బాధితురాలి అక్క అనంతమ్మ, చెల్లెలు రాజమ్మ ను సైతం దూషించడంతో.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎస్ఐపై ఎస్పీకు ఫిర్యాదు

అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని మంగళవారం మండలంలోని చింతలకుంటకు చెందిన బ్యాగరి నాగప్ప ఎస్పీకి ఫిర్యాదు చేశారు. చింతలకుంటకు చెందిన జములమ్మ తమ ఇంటి ముందర బండలు పాతడంతో దారి మూసుకుపోయింది. బండలు పాతవద్దంటూ వారించిందుకు జములమ్మ తమపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. విచారణకు పిలిచిన ఎస్ఐ తనతో పాటు తమ్ముడు నర్సింహులను దూషిస్తూ కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎస్ఐ శ్రీనివాసులు వివరణ కోరగా.. చింతలకుంటకు చెందిన జములమ్మ ఫిర్యాదు మేరకు నాగప్ప, నర్సింహులను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశామని, కానీ వారిని కొట్టాం అనడంలో నిజం లేదన్నారు.

దాడి కేసులో యువకుడి రిమాండ్

గద్వాల క్రైం: దాడికి పాల్పడిన యువకుడిని బుధవారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఇరవై రోజుల క్రితం ఇద్దరు యువకులు గద్వాల శివారులో మద్యం మత్తులో ఒకరిపై ఒకరు మద్యం సీసాలతో దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడు నవీన్‌ను విచారించగా.. దాడికి పాల్పడినట్లు నేరం అంగీకరించాడన్నారు. దీంతో గద్వాల కోర్టులో హాజరుపర్చగా నిందితుడికి 14 రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దు



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: మున్సిపల్ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ మున్సిపాలటీలో మంగళవారం తెల్లవారుజామున పారిశుద్ధ్య పనులను చైర్‌పర్సన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని వార్డుల్లో చెత్తా చెదారం ఎప్పటికప్పుడు తొలగించి, వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సామేల్, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు ఉన్నారు.

విచారణకు సిద్ధమా..

గద్వాల అర్బన్: గట్టు మండలంలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లో 244ఎకరాల ప్రభుత్వ భూమికి దొంగ రికార్డులు సృష్టించిన వ్యవహారంలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. నిరుపేద రైతులను అడ్డుపెట్టుకొని చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లో 244ఎకరాలు ప్రభుత్వ భూమికి దొంగ రికార్డులు సృష్టించి, దొంగ బిల్లులతో అవార్డు చేయకపోతే సిట్టింగ్ జడ్జి, లోకాయుక్త, విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ విచారణకు కోరాలని డిమాండ్ చేశారు.

‘తప్పుడు ఆరోపణలు సరికాదు’

చిన్నోనిపల్లి రిజర్వాయర్ విషయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రిజర్వాయర్‌పై అవగాహన లేని నాయకుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రాజకీయంగా లబ్ధి పొందడం కోసం రైతులను వాడుకోవడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ముని, చంద్రగౌడ్, శ్రీనివాసులు, హనుమంత్‌రెడ్డి, ఆంజేయులు గౌడ్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు



రామాపురంలో..

అయిజ: మండలంలో నిర్వహించనున్న మండల స్థాయి ‘సీఎం కప్పు టోర్నమెంట్’ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. మంగళవారం పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయం సమీపంలో, ఫ్రీడం పార్క్ సమీపంలో క్రీడా ప్రాంగణాలను తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మారెడ్డి, ఎంఈఓ రాములు పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న సీఎం కప్పు మండల స్థాయి టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అండర్ 14, అండర్ 18 విభాగాలుగా విభజించి బాల, బాలికలకు విడిగా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు బషీర్, సతీష్, పీఈటీలు సుబ్బన్న, రఘు తదితరులు ఉన్నారు.

శాంతినగర్: మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ నిర్వహించారు. మంగళవారం సీఎం కప్‌లో భాగంగా బాల బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడలను నిర్వహించారు. కార్యక్రమాలకు మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణ, ఎంఈఓ నరసింహ, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, వీరేష్ పాల్గొన్నారు.

కొమురం భీం కు ఘన నివాళి



అయిజలో కొమరం భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: తెలంగాణ విముక్తి కోసం నిజాం నవాబులను ఎదిరించిన కొమురం భీం జయంతిని బీజేపీ నాయకులు మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరంకుశత్వానికి, దమన నీతికి ఎదురు నిలిచి, ఆదివాసి ప్రజలకు అడవిపై హక్కుల కోసం నైజాం సర్కార్‌తో పోరాడి వీరమరణం పొందిన ధన్యచరితుడు కొమరం భీమ్ అని కొనియాడారు. ఆదివాసీల స్వయం పాలన కోసం ఆయన చేసిన జోడేఘాట్ తిరుగుబాటు మహోజ్వల చరిత్రగా నిలిచిపోయిందన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



ధరూరు: పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని అల్వాలపాడులోని ఎంపీహెచ్ఎస్ పాఠశాలలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లీలావతి, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, శైలజ, శివకుమార్, ఆంజయులు, షబానా తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ



జులకల్‌లో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

మల్దకల్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులతో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి ఉష, వెంకట్‌రాజ్ సూచించారు. మంగళవారం మండలంలోని అమరవాయిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రాముడు, మధు, ఆంజనేయులు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: మండలంలోని జులకల్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను జిల్లా పశు వైద్యాధికారి వెంకటేశ్వర్లు వేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వరలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి



మల్దకల్: రైతులు వ్యవసాయాధికారులు ఇచ్చే సలహాలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ సూచించారు. మంగళవారం రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలతో ముఖాముఖి మాట్లాడారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగం పెంచి భూములను సారవంతంగా ఉంచుకోవాలన్నారు. పంట మార్పిడితో పాటు పంటలను ఆశించే చీడపీడలను నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు హారిక, జోహన, కిషోర్, ఖాజాపాష తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

రాజోళి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలపల్లికి చెందిన శివ శాంతినగర్‌లోని పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాజోళికి వస్తుండగా.. న్యూప్లాట్స్ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.